

చేసేందుకా... కాజేసేందుకా?

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజ్–1 కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ నిధులు కొందరు అధికారులు, కాంట్రాక్టర్లకు ఫలహారంగా మారాయి. - 8లో▸



ఇళ్ల స్థలాలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి - 8లో▸

పేదలకు ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య హెచ్చరించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0°/26.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు బెస్ట్ అవైలబుల్ స్కీం డ్రా

ఏటూరునాగారం: ములుగు, భూపాలపల్లి జిల్లాలోని గిరిజన విద్యార్థులను బెస్ట్ అవైలబుల్ స్కీంలో ఎంపిక చేసేందుకు ఐటీడీఏ కార్యాలయంలో నేడు(శుక్రవారం) ఉదయం 10 గంటలకు డ్రా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ డీడీ పోచం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు ఈ డ్రా కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తీసుకొని రావాలని తెలిపారు.

మహాసభకు తరలిరావాలి



వాజేడు: ఏటూరునాగారంలో ఈ నెల 24న నిర్వహించే ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ములుగు జిల్లా మహాసభకు మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు తరలిరావాలని మాదిగ దండోరా జాతీయ నాయకుడు నెమలి నర్సయ్య మాదిగ, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకుడు వావిలాల స్వామి మాదిగ కోరారు. మండల పరిధిలోని చింతూరు, జగన్నాథపురం, ధర్మవరం గ్రామాల్లో అందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమించాల్సిన తరుణమం ఆసన్నమైందన్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాలు వర్గీకరణపై ఇంకా సాగదీస్తున్నాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తెస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి మాట తప్పిందన్నారు.

అధ్యాపకులకు డాక్టరేట్



జాటోత్ శంకర్



విజిత పిన్నింటి

ములుగు: ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న ఇద్దరు డాక్టరేట్ పొందారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పద్దినాయక్ తండాకు చెందిన శంకర్ జార్ఖండ్‌లోని రాధాగోవింద్ యూనివర్సిటీలో ఆచార్య సురేందర్ పర్యవేక్షణలో గణితశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. రాయపర్తి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన విజిత రసాయనశాస్త్రంలో ఆచార్య బ్రాత్‌సింగ్ పర్యవేక్షణలో రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. కాగా, ఇరువురిని గురువారం కళాశాల ప్రిన్సిపాల్ రజినీలత, తోటి అధ్యాపకులు అభినందించారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



ములుగురూరల్: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపుడి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ సభ్యులతో కలిసి గురువారం ఇంటింటి ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఒకే రోజు 35లక్షల కుటుంబాలతో కలిసి బీజేపీ మమేకం అయ్యేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బీజేపీ నాయకుడు కనీసం వంద కుటుంబాలను పలకరించేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్‌యాదవ్, ప్రమోద్‌రెడ్డి, రాజ్‌కుమార్, రాకేష్‌రెడ్డి, విజయ్, కుమార్, ప్రవీణ్, యశ్వంత్, రాకేష్, రమేష్ పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించింది.. పశువుల కోసమేనా?



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట లక్షలాది రూపాయలతో ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి పర్యవేక్షణలో మోడల్ గార్డెనింగ్‌ను ఏర్పాటు చేశారు. ఆవరణలో విలువైన మొక్కలు, ఖరీదైన గడ్డిని పెంచుతున్నారు. సుమారు రూ.1.50లక్షలు వెచ్చించి చుట్టూ ఫెన్సింగ్ వేయించడంతోపాటు సీడ, షో మొక్కలను నాటారు. కానీ వాటికి సరైన రక్షణ లేక గురువారం పశువులు అందులోకి చొరబడి ఉన్న మొక్కలు, గడ్డిని మేశాయి. ఐటీడీఏ సిబ్బంది, అధికారుల కళ్లుగప్పి పశువులు దూరాయంటే వారి పనితనం ఎంతగా ఉందో.. అధికారుల నిర్లక్ష్యం.. ఏ మేరకు ఉందో అర్థం అవుతుంది. రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్న చందంగా గిరిజనుల సొమ్ము పశువుల పాలైందని పలువురు విమర్శిస్తున్నారు.

పుష్కరాల నిధులు గోదారి పాలు

ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల ముందుచూపు లేని కారణంగా కోట్ల రూపాయల విలువైన రైతుల భూములతోపాటు పుష్కరాల సమయంలో అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన కోట్లాది రూపాయల నిధులు గోదారి పాలయ్యాయి. 2015లో పుష్కరాల సమయంలో రూ.4.22కోట్లతో నిర్మించిన 170 పుష్కరఘాట్ కోతకు గురై కొట్టుకుపోయింది. 1.380 మీటర్ల బీటీ రోడ్డు, రూ.14.37లక్షలతో ఏర్పాటు చేసిన 12 వాటర్ సిస్టర్న్‌లు, పైప్‌లైన్, సైతం గోదావరిలో కలిసిపోయాయి. అధికారుల ముందు చూపు లేకపోవడంతోపాటు, ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కోతకుగురైన గోదావరి ఒడ్డు



కరకట్ట కలేనా..?

ముందుకు సాగని నిర్మాణ పనులు

- మండల కేంద్రానికి పొంచి ఉన్న ముప్పు
- గోదారి పాలవుతున్న సాగుభూములు

మంగపేట: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని గోదావరి ఒడ్డు వెంట కరకట్ట నిర్మాణం కలగానే మిగులుతుంది. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛగా ఉన్న కరకట్ట నిర్మాణంపై ఒక అడుగుముందుకు రెండు అడుగులు వెనక్కు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.. అధికారులు, ప్రజాప్రతినిధులు. ప్రతి ఏటా వర్షాకాలంలో వరద కారణంగా గోదావరి ఒడ్డు వెంట గల వేలాది ఎకరాల సాగుభూములు గోదావరిలో కలిసిపోతోన్నాయి. దీంతో 30 ఏళ్ల క్రితం నుంచి గోదావరి ఒడ్డు వెంట రైతులుకు వరద కోత గుండెకోతగా మారింది. గోదావరి ఒడ్డు వెంట సాగుభూములు కోతకు గురి కాకుండా ఉండేందుకు 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్యాకేజీ వర్క్ కింద రూ.5,77,40,450 నాబార్డు నిధులను మంజూరు చేశారు. కమలాపురం నుంచి సుమారు 3 కిలోమీటర్ల కరకట్ట నిర్మాణం చేపట్టిన గుత్తేదారు మండల కేంద్రంలోని గౌరారంవాగు బ్రిడ్జి వద్ద నుంచి సుమారు 500 మీటర్ల మేర రిటైనింగ్‌వాల్ నిర్మాణం, పొదుమూరు వరకు కరకట్ట నిర్మించి, దొంగలఒర్రె నుంచి పుష్కరఘాట్ వరకు కరకట్ట నిర్మాణం చేపట్టకుండా వదిలేయడంతో ప్రతి ఏటా గోదావరి ఒడ్డు వెంట సాగుభూములు కోతకు గురవుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గడిచిన 15 ఏళ్లకాలంలో గోదావరి ఒడ్డు వెంట విలువైన వందల ఎకరాల నల్లరేగడి భూములు ఇప్పటికే కోతకు గురై గోదావరిలో కలిసిపోయాయి. గోదావరి ఒడ్డు వెంట ఉన్న ఎకరం, రెండెకరాల సాగుభూమి మొత్తం గోదావరిలో కలిసిపోయిన పేదరైతులు నిరుపేదలుగా మారారు.

భూసేకరణకు సర్వే

మంగపేటలోని సంధ్రోని ఒర్రె నుంచి పుష్కరఘాట్ వరకు రెండున్నర కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించేందుకు రూ.54.09 కోట్ల ఫ్లడ్ బ్యాంక్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు చేపట్టేందుకు ప్రభుత్వం టెండర్ నిర్వహించగా హర్ష కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండరు దక్కించుకుంది. పనులు ప్రారంభించేందుకు గోదావరి ఒడ్డు నుంచి సుమారు 30 మీటర్ల వెడల్పుతో రెండున్నర కిలోమీటర్ల దూరం వరకు 50 నుంచి 60 ఎకరాల భూమి కోసం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించారు. కానీ, వర్షాకాలం వచ్చినా నేటి వరకు పనులు చేపట్టకపోవడంతో ప్రభుత్వం, అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



సర్వే చేస్తున్న అధికారులు

మండల కేంద్రం కనుమరుగయ్యే ప్రమాదం

కరకట్ట నిర్మాణంలో గత 15 ఏళ్ల నుంచి జరుగుతున్న జాప్యం వల్ల మున్ముందు మండల కేంద్రం కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని పొదుమూరుకు కిలో మీటరుకు పైగా దూరంలో ఉండే గోదావరి గడిచిన 15 ఏళ్ల కాలంలో ఒడ్డు కోతకుగురి కావడంతో ప్రస్తుతం గ్రామానికి సుమారు 200 మీటర్ల దూరం మాత్రమే ఉంది. దీంతోపాటు ఊరచెరువుకు గోదావరి ఒడ్డుకు సుమారు 80 నుంచి 100 మీటర్ల దగ్గరకు చేరింది. రాబోయే కాలంలో గోదావరి వరద కారణంగా చెరువుకు ప్రమాదం పొంచి ఉండటం, చెరువుకు అతి సమీపంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, లోతట్టు ప్రాంతం మీదుగా గోదావరి వరదనీరు మండల కేంద్రంలోకి వచ్చే ప్రమాదం లేకపోలేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అదే జరిగితే మంగపేట మండల కేంద్రం సైతం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు.

పనులు చేపట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో..?

ఏటూరునాగారం మండలంలోని రాంనగర్ వద్ద 6 కిలోమీటర్లు, మంగపేట మండలంలోని దొంగలఒర్రె వద్ద నుంచి పుష్కరఘాట్ వరకు 2.5కిలో మీటర్ల వరకు గోదావరి తీరంవెంట కరకట్ట నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం రూ.109.79 కోట్లు, భూసేకరణకు రూ.27 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆయా పనులు చేపట్టేందుకు హర్ష కన్‌స్ట్రక్షన్‌తో 2022 ఏప్రిల్ 04న అగ్రిమెంట్ కూడా పూర్తయింది. ఆయా పనులను ప్రారంభించే క్రమంలో అధిక వర్షాలు, గోదావరి వరదల కారణంగా పనులు నిలిచిపోయినట్లు అప్పట్లో అధికారులు తెలిపారు.

ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం



ప్రభుత్వం, ఎక్స్‌పర్ట్ కమిటీ ఆదేశాల మేరకు కరకట్ట నిర్మాణ పనులు చేపట్టేందుకు అవసరమైన మేరకు భూసేకరణ కోసం సర్వే చేశాం. సర్వే నివేదికను ములుగు ఆర్డీఓకు సమర్పించాం. కరకట్ట నిర్మాణానికి డ్రాయింగ్ అప్రూవల్ కోసం పీఈసీడీఓ హైదరాబాద్ వారికి డ్రాయింగ్ సమర్పించాం. ఫ్లడ్ మోడల్ స్టడీస్ కోసం పీఎస్ ఈఆర్ఎల్ వారికి నివేదికలు అందచేశాం. అనుమతులు వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం.

– ఇరిగేషన్ ఏఈఈ వలీ మహ్మద్, మంగపేట సెక్షన్

నాలుగు ఎకరాలు గోదారిలో కలిసింది..



గోదావరి ఒడ్డు వెంట 11 ఎకరాల భూమి కోతకు గురై గోదారిలో కలిసి పోగా ఎకరం మాత్రమే మిగిలింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదు. ఉన్న ఎకరం పొలంతోపాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ.. జీవనం సాగిస్తున్నా. ఉన్న ఎకరంలో కరకట్ట నిర్మాణం కొరకు అర ఎకరం భూమి పోతోంది. అర ఎకరానికి మాత్రమే నష్ట పరిహారం చెల్లిస్తామంటున్నారు. గోదావరిలో కోల్పోయిన మొత్తం భూమికి పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– బొల్లె రాములు, పొదుమూరు, భూ యజమాని

2022 జూలైలో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలు పడటంతో గోదావరి ఉప్పొంగి ప్రవహించడంతో జూలై 17న సీఎం కేసీఆర్ భద్రాచలం నుంచి ఏటూరునాగారం వరకు ముంపు ప్రాంతాలను హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏటూరునాగారం ఐటీడీఏలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2008 సర్వే నివేదిక ఆధారంగా చేపట్టే కరకట్ట నిర్మాణం పనుల తాత్కాలికంగా నిలుపుదల చేసి ప్రస్తుత జూలైలో వచ్చిన గోదావరి వరద నీటి ప్రమాదాన్ని నివారించే విధంగా భద్రాచలం నుంచి ఏటూరునాగారం వరకు అవసరమైన ప్రతి చోటా కరకట్ట నిర్మించేందుకు రీసర్వే చేసి నూతన ఎస్టిమేట్ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించినట్లు అధికారులు చెప్పుకొచ్చారు.

ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ములుగు: దశాబ్ది ఉత్సవాల పేరుతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తుందని జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో గురువారం ములుగు జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు జిల్లా అధ్యక్షుడు అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్‌ను బలవంతంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇస్తారని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న ప్రజలకు దశాబ్ది కాలంలో నిరాశే మిగిలిందన్నారు. అసెంబ్లీ సాక్షిగా పోడు పట్టాలు ఇస్తానని చెప్పిన మాట ఏమైందని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి దశాబ్ది ఉత్సవాలు ఎలా జరుపుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు రంగుల గోడలు కాదు అని ప్రతి పేద వాడి నైతిక అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి అని అన్నారు. తరుగు తేమ పేరుతో క్వింటాకు 5 నుంచి 10 కేజీల ధాన్యం కోత విధిస్తుంటే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రవళి రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్ల పెల్లి రాజేందర్ గౌడ్, వంగ రవి యాదవ్, కంబాల రవి, కొమురం ధనలక్ష్మీ, చాంద్ పాషా, వెంకటకృష్ణ, చంద్రమౌళి, సీతారాం నాయక్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. శాంతియుతంగా ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని ఎమ్మెల్యే సీతక్క గురువారం ఓ ప్రకటనలో ఖండించారు.

చెత్తాచెదారం తొలగింపు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివకల్యాణి మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కళాశాల ఆవరణలో ఉన్న చెత్తాచెదారం తొలగించామన్నారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆవరణలో మొక్కలను నాటించి వాటికి విద్యార్థుల పేర్లను ఏర్పాటు చేశామన్నారు.

అమరుల త్యాగఫలమే ప్రత్యేక తెలంగాణ



అమరవీరుల కుటుంబాలను సన్మానిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

ములుగు: అమరుల త్యాగఫలంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల దినోత్సవాన్ని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, ఎస్పీ గాష్ ఆలం, అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి, వైవీ గణేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి అమరవీరులకు నివాళులర్పించారు. అమరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సమావేశ మందిరంలో కలెక్టర్ కృష్ణ ఆదిత్య మాట్లాడారు. అమరుల త్యాగంతో ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుకుంటున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందిందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్వరాష్ట్రం కోసం ఆత్మ బలిదానాలు చేసుకున్న అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం గొప్ప విషయం అన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అసువులు బాసిన రాజ్‌కుమార్ తండ్రి సాంబయ్య మాట్లాడుతూ.. నా కుమారుడు తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేసుకున్నందుకు నా కుటుంబ సభ్యుల్లో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.10లక్షల అందించారని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీల కుటుంబాలను సత్కరించారు.

అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండ..

అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. అమరుల సంస్మరణ దినం సందర్భంగా జెడ్పీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అమర జ్యోతి వెలిగించి, అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం అమరుల సంస్మరణ తీర్మానాన్ని ములుగు జెడ్పీటీసీ సకినాల భవాని ప్రవేశపెట్టగా జెడ్పీ ఫ్లోర్ లీడర్ తుమ్మల హరిబాబు బలపరిచారు. సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మేరకు నాగజ్యోతి మాట్లాడుతూ.. అమరుల ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ దేశానికే ఆదర్శంగా నిలబెడుతున్నారని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా వైద్యాధికారి అప్పయ్య, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రకాష్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి తుల రవి, జిల్లా మార్కెట్ అధికారి సుచరిత, సివిల్ సప్లయీస్ అధికారి అరవింద్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డీసీఓ సర్దార్ సింగ్, వెటర్నిటీ అధికారి విజయ్ భాస్కర్, ట్రెజరీ అధికారి జర్పన్, డీపీఓ వెంకయ్య, ప్రేమలత, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రఫిక్, విజయ భాస్కర్, సత్యనారాయణ స్వామి, గై రుద్రమదేవి, రమణ, కరంచంద్ గాంధీ, వలియాబి, రియాజ్ మీర్జా, ఎంపీపీ రజిత, పోరిక గోవింద్ నాయక్, జెడ్పీ సీఈఓ ప్రసూనా రాణీ, డిప్యూటీ సీఈఓ రమాదేవి, దిలీప్, బద్దం సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒలింపిక్ రన్

భూపాలపల్లి అర్బన్: అంతర్జాతీయ 37వ ఒలింపిక్ డేను పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గురువారం ఒలింపిక్ రన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారిణి బుర్ర సునీత ముఖ్య అతిథిగా హాజరై రన్‌ను ప్రారంభించారు. హనుమాన్ దేవాలయం నుంచి అంబేద్కర్ క్రీడామైదానం వరకు రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ పూతల సమ్మయ్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ప్రశాంత్, రామకృష్ణ, పీఈటీలు రఘు, జైపాల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు

సింగరేణి సంస్థలో జీతాలు ఇవ్వలేని పరిస్థితి

- ఏనాడైనా అమరులకు నివాళులర్పించారా..?
- ఎన్నికల వేళ కొత్త డ్రామాలకు సీఎం తెర
- బీజేపీ అధికారంలోకి రాగానే ఉచిత విద్య, వైద్యం
- ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



బహిరంగ సభలో మాట్లాడుతున్న బండి సంజయ్

భూపాలపల్లి/భూపాలపల్లి రూరల్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని.. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. బీజేపీ చేపట్టిన మహా జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బండి సంజయ్ మాట్లాడారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక పాత బకాయిలు మొత్తం చెల్లించి సంస్థను పరిరక్షిస్తామని చెప్పారు. సింగరేణి సంస్థలో గతంలో 72వేల మంది కార్మికులు ఉండగా.. ఇప్పుడు 42వేలకు తగ్గారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ తన కూతురు కవితను యూనియన్ నాయకురాలిని చేసి సంస్థను ఏటీఎంలా వాడుకుంటున్నారని ఆరోపించారు. సింగరేణికి వేల కోట్ల ఆదాయం వస్తుందని చెబుతున్న సీఎం.. కార్మికులకు ఐటీ రీయింబర్స్‌మెంట్ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఓపెన్‌కాస్ట్‌లను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్.. ఇయాల 17 ఓపెన్‌కాస్ట్‌లకు అనుమతి తీసుకున్నాడన్నారు. సింగరేణి నుంచి రూ.25వేల కోట్ల అప్పు ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. సంస్థను దివాలా తీయించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మికుల జీతాల కోసం బ్యాంకుల్లో బాండ్లు కుదువపెట్టుకునే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. నిరుద్యోగ భృతి, రుణమాఫీ, ఉచిత యూరియా, విత్తనాలు, ఇంటికో ఉద్యోగం, పోడు భూములకు పట్టాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నందుకు.. ప్రజలను దారి మళ్లించేందుకు పీఎం మోదీ తనకు దోస్త్ అని సీఎం ప్రచారం చేసుకుంటున్నాడని అన్నారు. చేయి గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలందరూ ఏ పార్టీలోకి పోయారో ప్రజలకు తెల్వదా అన్నారు. ఏ పార్టీతో పొత్తు లేకుండా ప్రజల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ బీజేపీయేనన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో ఏనాడైనా తెలంగాణ అమరవీరులకు సీఎం కేసీఆర్ నివాళులర్పించారా.. అని ప్రశ్నించారు. ఎన్నికల వేళ కొత్త డ్రామాలకు తెర లేపుతున్నాడన్నారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వచ్చాక ఉచిత వైద్యం, విద్య, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని తెలిపారు. జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బహిరంగ సభలో రిటైర్డ్ డీజీపీ కృష్ణప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు చందుపట్ల కీర్తి రెడ్డి, రాకేష్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు కన్నం యుగేందర్, ఉదయ్‌ప్రతాప్, సునీల్‌రెడ్డి, పాపయ్య, రాజుగౌడ్, ఎరుకల గణపతి, మునీందర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన పార్టీ కార్యకర్తలు, ప్రజలు

‘స్వచ్ఛత పక్వాడా’ ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం గురువారం భూపాలపల్లి ఏరియాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియాలోని సింగరేణి ఏరియా ఆస్పత్రిలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా అధికార ప్రతినిధి, డీజీఎం తుకారాం హాజరయ్యారు. ఈ పక్షోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని తుకారాం సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైసీఎంఓ డాక్టర్ పద్మజ, అధికారులు కృష్ణప్రసాద్, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

కస్తూర్బాగాంధీ పాఠశాల తనిఖీ చేసిన జీసీడీఓ రమాదేవి



మాట్లాడుతున్న జీసీడీఓ రమాదేవి

ఏటూరునాగారం: కస్తూర్బాగాంధీలో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని జీసీడీఓ, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లోని వస్తువులను పరిశీలించారు. వంటగదిలో శుభ్రత పాటించాలని చెప్పారు. తరగతిలోకి వెళ్లి హోమ్ వర్క్ చేశారా.. లేదా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టాఫ్ సమావేశాన్ని నిర్వహించి మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిశుభ్రమైన నీరు, వేడి ఆహారం మాత్రమే వడ్డించాలని ఆదేశించారు. వర్షాకాలంలో ఎలాంటి వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలను పాటించాలని సూచించారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

తాత్కాలిక పద్ధతిలో నియామకాలు

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహాత్మాజ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో విద్యాబోధనకు తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేపడుతున్నట్లు ఆ బీసీ గురుకులాల ఆర్‌సీవో వై మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో విద్యబోధన చేయాల్సి ఉంటుందన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులో విద్యాబోధన చేయాల్సింటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్లతో హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో డెమో, ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఈనెల 26న తెలుగు, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టులకు, 27న సైన్స్, ఇంగ్లిష్ ,హిందీ సబ్జెక్టులకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9154102639, 9550064323 నంబర్లను సంప్రదించాలన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ తోపాటు బీఈడీ కలిగి ఉండాలన్నారు.

రిటైర్డ్ ఎంపీడీఓ హత్యపై విచారణ..?

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యపై పోలీసులు పలువురిని విచారిస్తున్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు చెందిన దాదాపు 40 మందిని స్టేషన్‌కు తీసుకొచ్చి వారి కాల్ డేటాతోపాటు పలు వివరాలు సేకరించారు. కాగా, రామకృష్ణయ్యను గిరబోయిన అంజయ్య ఈనెల 15న హత్య చేయించిన విషయం పోలీసుల విచారణలో వెల్లడైంది తెలిసిందే. అదే రోజు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి ఇంటి ఎదుట పలువురు సంబురాలు జరుపుకున్న అనంతరం విందు ఏర్పాటు చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ విందులో పాల్గొన్న వారిని స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు.. సంబురాలు ఎందుకు చేసుకున్నారనే కోణంలో విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకేమీ తెలియదని చెబుతున్నారు.



ఆరేళ్ల తర్వాత హడావుడిగా చేపట్టిన హనుమకొండ పెగడపల్లి డబ్బాల సమీపంలో కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ పనులు

ఆరేళ్ల కిందట రూ.873.61 కోట్లు..

ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ కోసం 2017లో 83 పనుల కోసం రూ.873.61 కోట్లు జీఓఎంఎస్ 67 ద్వారా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిర్మల్ జిల్లా పోచంపాడు నుంచి (0.000 కి.మీ.ల నుంచి 284.000 కి.మీ.ల) ఖమ్మం జిల్లా తీర్థాల వరకు ప్రధాన కాల్వల ఆధునికీకరణతోపాటు లక్ష్మీ కెనాల్, సరస్వతి కెనాల్, సదర్మాట్‌ల మెయింటనెన్స్ పనులకు నిధులిచ్చారు. ప్రధానంగా కాకతీయ ప్రధాన కాల్వ ఏడు పనుల కోసం రూ.385.56 కోట్లు, 63 డిస్ట్రిబ్యూటరీల కోసం రూ.356.14 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం కేటాయించిన మొత్తం రూ.873.61 కోట్లలో రూ.741.70 కోట్లు ప్రధాన కాల్వల ఆధునికీకరణకు ఇచ్చారు. ఈ పనులకు 2018లో టెండర్లు జరగగా, వరంగల్, హైదరాబాద్‌లకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. వరంగల్ జిల్లాకు చెందిన కొందరు కీలక ప్రజాప్రతినిధులు అసలు కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేసి వారి బినామీ కాంట్రాక్టర్లకు సబ్ కాంట్రాక్ట్‌కింద పనులు కట్టబెట్టారు. ఏడాదిలో పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా.. సాగదీస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేసేందుకా... కాజేసేందుకా?

ఆరేళ్లుగా పెండింగ్‌లో ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ

- రూ.873.61 కోట్లతో 83 పనులు.. 2018లో పూర్తయిన టెండర్లు
- కాల్వల్లో నీటి ప్రవాహం పేరిట కాలయాపన....
- హడావుడిగా రూ.122.90 కోట్ల పనులు మొదలెట్టిన కాంట్రాక్టర్లు
- మళ్లీ వర్షాలు పడే ముందు మొదలెట్టడంపై అనుమానాలు
- ఫలహారంగా కాకతీయ కాల్వల ఆధునికీకరణ నిధులు
- గతంలో డీబీఎం 38, 48 పనుల్లో అక్రమాలు.. సొంతశాఖ నుంచే ఫిర్యాదులు..
- ఇంకా కొనసాగుతున్న 'విజిలెన్స్'విచారణ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజ్–1 కాకతీయ ప్రధాన కాలవ్ల ఆధునికీకరణ నిధులు కొందరు అధికారుల, కాంట్రాక్టర్లకు ఫలహారంగా మారాయి. ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులు, కాలవ్ల నిర్మాణం, ఆధునికీకరణకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తోంది. కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు కావడం వల్ల నిధులు దుర్వినియోగం అవుతుండడంతోపాటు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

సాక్షిప్రతినిధి, వరంగల్:

వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ గీసుకొండ, పర్వతగిరి ప్రాంతాల్లో డీబీఎం–38, డీబీఎం–48లలో జరిగిన పనుల్లో భారీగా అక్రమాలు జరిగాయి. సుమారు రూ.100 కోట్ల పనుల్లో 25 శాతం వరకు పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారన్న ఫిర్యాదులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఆ తర్వాత మిగతా పనులు కూడా నిలిపి వేశారు. జగిత్యాల ఏరియాలో రూ.51.16 కోట్లు, ఎల్ఎండీ పైన రూ.32.24 కోట్లతో పనులు పూర్తి కాగా, ఎల్ఎండీపరిధిలోని 146 కి.మీ.ల నుంచి 191 కి.మీ.ల వరకు రూ.133.51 కోట్ల పనులు చాలా చోట్ల పెండింగ్‌లో పెట్టారు. అదే విధంగా రూ.122.09 కోట్లు కేటాయించిన 191 కి.మీ.ల నుంచి 234 కి .మీ.ల (తాడికల్ నుంచి కేయూ క్యాంపస్ సమీపం) వరకు కూడా పనులు చేయలేదు. ఆరేళ్లుగా కాల్వల్లో నీటి ప్రవాహం ఉందని కారణంగా కాలయాపన చేసిన అధికారులు, కాంట్రాక్టర్లు.. సరిగ్గా వానాకాలం ఆరంభానికి ముందు.. పదిహేను రోజుల కిందట మళ్లీ పనులు మొదలెట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు చేసేందుకా?.. గతంలో లాగే కాజేసేందుకా? అన్న చర్చ జరుగుతోంది.



తూతూ మంత్రంగా..సాగుతున్న హనుమకొండ యాదవనగర్ సమీపంలో ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ పనులు

డీబీఎం–38,48 పనులపై సాగుతున్న 'విజిలెన్స్'విచారణ...

వరంగల్ జిల్లాలోని ఎస్ఆర్ఎస్పీ, డీబీఎం 48 సీసీహెచ్ డివిజన్ నంబర్ 4 పరిధిలోని తీగరాజుపల్లి, పర్వతగిరి, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం జిల్లాలోని తీర్థాల వరకు ఆధునికీకరణ పనుల కోసం రూ.123కోట్లు కేటాయించారు. ఈ నిధులతో డీబీఎం 48, 1ఆర్ 2ఎల్, 3ఎఆర్, 6ఎల్, 10ఆర్, 1,13 ఆర్, 16 ఆర్, 17 ఎల్, 21ఆర్, 24 ఆర్, 25 ఎల్, 26 ఎల్, 27 ఎల్, 28 ఆర్, 29 ఎల్, 30 ఆర్, 31 ఎల్, 32 ఎల్, 34 ఆర్, 35 ఎల్, 26 ఆర్, 38 ఆర్ ఉప కాల్వల అభివృద్ధి, ఎర్త్ వర్క్ బ్యాంకింగ్, సీసీ లైనింగ్, ఇన్‌స్పెక్షన్ పాత్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే, ఈ పనులు చేయకుండానే కాంట్రాక్టర్లు, అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై దాదాపు రూ.17 కోట్ల పనులు జరిగినట్లుగా బిల్లులు రికార్డు చేసుకొని, డబ్బులు డ్రా చేసుకున్నారన్న ఫిర్యాదులపై ప్రభుత్వం ఆదేశించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ ఇంకా సాగుతోంది. డీబీఎం 38 ప్యాకేజీ పనులు గీసుకొండ, మల్లంపల్లి, పరకాల వరకు రూ.123 కోట్ల అంచనా వ్యయంతో డోవెల్ బ్యాంకింగ్, సీసీ లైనింగ్, ఇన్‌స్పెక్షన్ పాత్‌ల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగంపైన విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో ఆరేళ్ల పెండింగ్‌లో ఉన్న పనులను వర్షాకాలం ముందు ప్రారంభించడం వల్ల మళ్లీ నాసిరకం పనులతో నిధులు కాజేసే అవకాశం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి.

కాల్వల్లో నీరుండడం వల్లే ఆలస్యం..

2018 జనవరిలో పనులు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి కాల్వల్లో నీళ్లు ఉండటం వల్లే ఆలస్యం జరిగింది. రూ.122.09 కోట్ల వ్యయంతో 191–234 కిలోమీటర్లు వరకు చేయాల్సిన పనులకు గాను 202 కి.మీ.ల వరకు పూర్తయ్యాయి. చివరి ఆయకట్టు వరకు ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. ప్రస్తుతం 202–234 కి.మీ.ల వరకు పనులు చేపట్టారు. నాణ్యతాప్రమాణాల ప్రకారం పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కె.సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ

రీ–ఆర్గనైజేషన్ వల్ల ..

కాకతీయ ప్రధాన కాల్వల పునరుద్ధరణ పనుల పూర్తికి నీటి ప్రవాహంతో పాటు నీటి పారుదల శాఖ రీ–ఆర్గనైజేషన్ కారణంగా ఆలస్యమైంది. ఏఈఈలు మొదలు చీఫ్ ఇంజనీర్ల వరకు మారి, కొత్త వాళ్లు వచ్చారు. ఈ వానాకాలంలోనైనా చివరి ఆయకట్టుకు నీరందాలంటే ఇప్పటికే పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జూలై నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని మొదలు పెట్టాం. వర్షాల ఉధృతి పెరగకముందే పూర్తి చేస్తాం.

– సునీత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జలవనరులశాఖ

పథకం పేరు: ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ

మొత్తం పనులు:	83
మంజూరైన నిధులు:	రూ.873.61 కోట్లు
పనులు ప్రారంభం:	2018 జనవరి
స్థిరీకరించిన ఆయకట్టు :	13.70 లక్షల ఎకరాలు

గార్ల ఎంపీపీపై దాడి

- 16 మందిపై కేసు



ఎంపీపీపై దాడి చేస్తున్న రాంసింగ్ అనుచరులు

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల ఎంపీపీ ఎం శివాజీచౌహాన్‌పై దాడికి పాల్పడిన ఘటనలో 16 మందిపై గురువారం కేసులు నమోదయ్యాయి. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం మండలంలోని పెద్దకిష్టాపురానికి చెందిన జీ రాంసింగ్ బుధవారం రాత్రి తిర్లాపురంలోని బంక్‌కు వెళ్లి పెట్రోల్ పోయించుకున్నారు. అనంతరం పెట్రోల్ బాయ్ సాయికి రూ. 2వేల నోటు ఇవ్వగా, తమ యజమాని రూ.2వేల నోటు తీసుకోవద్దన్నాడని.. ఫోన్‌పే చేయమని కోరాడు. దీంతో రాంసింగ్..రూ. 2వేల నోటు ఎందుకు తీసుకోవంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కారును మూవ్ చేశారు. ఈ క్రమంలో కారు ఆపమని డోర్ పట్టుకున్న సాయి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. పెట్రోల్ బాయ్ కేకలు వేయడంతో గ్రామస్తులు రాంసింగ్ కారును ఆపారు. ఈలోపు పెట్రోల్ కోసం వచ్చిన ఎంపీపీ శివాజీ చౌహాన్ విషయం తెలుసుకుంటుండగా ఎంపీపీపై కూడా రాంసింగ్ దురుసుగా ప్రవర్తించడంతో ఎంపీపీ మందలించాడు. దీనిని దృష్టిలో ఉంచుకున్న రాంసింగ్ గురువారం ఉదయం తన అనుచరులతో గార్లకు వచ్చి ఎంపీపీపై దాడి చేశారు. ఈ దాడిలో ఎంపీపీతో పాటు అతని తమ్ముడు, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎంపీపీ ఫిర్యాదు మేరకు రాంసింగ్‌తో పాటు అతని అనుచరులు 16 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపాడబోయి.. కనిపించని లోకాలకు..

- విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం



కొమ్మయ్య మృతదేహం

సంగెం: ఇనుప దండెంపై తడిబట్టలు ఆరవేస్తున్న మహిళకు కరెంట్ షాక్ తగలడంతో అరుపులు విని కాపాడబోయి అదే తీగ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కాపులకనిపర్తికి చెందిన సదిరం కొమ్మయ్య(57) ఇంటి ఎదుట గల ఇనుప దండెంపై పక్కింటికి చెందిన సదిరం రమ తడి బట్టలు ఆరవేస్తోంది. ఈ క్రమంలో దండెంకు కరెంట్ సరఫరా వచ్చి రమ విద్యుదాఘాతానికి గురై కేకలు వేసింది. అక్కడే ఉన్న కొమ్మయ్య రమ విడిపించే ప్రయత్నంలో దండెంకు తగలగా విద్యుత్ షాక్‌క గురై అక్కడిక్కడే మృతి చెందాడు. రమ తీవ్రగాయంతో స్పృహతప్పి పడిపోయింది. రమను 108లో ఎంజీఎంకు తరలించారు. మృతుడి కుమారుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

'గీతం'లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు

- యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ఉదయకుమార్

హన్మకొండ అర్బన్ : జాతీయ విద్యా విధానం–2020 అమలులో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2023–2024 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ (హానర్స్) కోర్సులను ప్రారంభిస్తున్నట్లు యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ సి.ఉదయకుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం నగరంలోని సుప్రభ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కోర్సులు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయన్నారు. ఈ నాలుగేళ్ల కోర్సుల ద్వారా విద్యార్థులు క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, భావ ప్రకటన నైపుణ్యాలతో పాటు, కళలు, మానవీయ శాస్త్రాలు, మేనేజ్‌మెంట్, సైన్స్‌లోని అంతర్ విభాగ పాఠ్యాంశాలను అభ్యసించొచ్చని తెలిపారు. గీతం నూతనంగా తీసుకువస్తున్న లిబరల్ ఎడ్యుకేషన్ (ఉదార విద్య) ద్వారా విద్యార్థులు బీఏ, బీబీఏ, బీఎస్సీలలో దేనిలో చేరినా మొదటి సెమిస్టర్‌లో మొత్తం ఒకేరకమైన పాఠ్యాంశాలను అభ్యసిస్తారని, రెండో సెమిస్టర్‌లో విద్యార్థులు కావాలనుకుంటే ఈ మూడింటిలో ఒకదానిలో నుంచి మరో కోర్సుకు మారవచ్చన్నారు. దేశంలో 19 కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో సహా 105 వర్సిటీలలో ఈ విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు ప్రారంభంకానున్నట్లు తెలిపారు. అందులో గీతం కూడా ఒకటి ఆయన తెలిపారు. కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మూగ యువకుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ



వంశీ మృతదేహం

జనగామ రూరల్ : జ్వరంతో బాధపడుతున్న ఓ మూగ యువకుడిని చికిత్స నిమిత్తం జనగామలోని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చిన కొద్ది గంటలలోనే మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం మండలంలోని ఓబుల్‌కేశావాపూర్‌కు చెందిన కర్రె వంశీ (18) జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు గురువారం ఆస్పత్రికి తీసుకురాగా మొదట ఈసీజీ తీసిన వైద్యులు.. అనంతరం అడ్మిట్ చేసుకున్నారు. ఉదయం 11 గంటలకు వైద్యం చేస్తుండగా మృతి చెందాడు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి..

ఉదయం 8 గంటలకే ఆస్పత్రికి తీసుకొచ్చినా 11 గంటల వరకూ వైద్యం చేయకపోవడంతోనే ఆరోగ్య పరిస్థితి విషమించి వంశీ మృతి చెందాడని, దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపించారు. 11.30 గంటలకు ఇంజక్షన్ ఇచ్చిన తరువాత 11. 45 గంటలకు మృతి చెందాడని వైద్యులను నిలదీశారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్ రాజును వివరణ కోరగా వంశీకి ఆస్పత్రిలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా వెంటనే వైద్యం అందించారని తెలిపారు.

చంద్రయ్యపల్లిలో చికిత్స పొందుతున్న యువకుడు..



అనిల్(ఫైల్)

నల్లబెల్లి: అజాగ్రత్తతో బైక్ నడిపిన ఓ యువకుడు.. గైడ్ పోస్టును ఢీకొని వాగులో పడ్డాడు. దీంతో తీవ్రగాయాలుకాగా స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లికి చెందిన పాండవుల రమణమ్మ, రాజన్న దంపతుల కుమారుడు అనిల్(24) నల్లబెల్లి రెడీమిక్స్ ప్లాంట్‌లో జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం శనిగరం క్రాస్‌లో వ్యక్తిగత పనులు ముగించుకున్న అనిల్.. బైక్‌పై నల్లబెల్లి వైపు వస్తూ అజాగ్రత్తతో మధ్యలవాగు గైడ్ పోస్టును ఢీకొన్నాడు. దీంతో బైక్‌తో సహా వాగులో పడిపోగా తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేశ్ తెలిపారు.

కంచనపల్లిలో మరో యువకుడు..



రమేశ్(ఫైల్)

రఘునాథపల్లి: అకారణంగా భార్య కేసు పెట్టిందని మనస్తాపానికి గురైన భర్త.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కంచనపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన కొడగాని రమేశ్ (28)కు అదే గ్రామానికి చెందిన కాంటెవాడ పెద్ద సోమయ్య కూతురు సునీతతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఏడాది క్రితం దంపతులు హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడ గొడవలు జరగడంతో భార్య సునీత.. భర్త పై ఉప్పల్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనోవేదనకు గురైన రమేశ్ కంచనపల్లికి వచ్చి తల్లి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆయన బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే జనగామ వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

రైతులకు పైసా పరిహారం ఇవ్వలే..

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం

ఎస్ఎస్ తాడ్వాయి: ఈ ఏడాది ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.11 వేల పరిహారం చెల్లిస్తానని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకూ పైసా ఇవ్వలేదని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. దివంగత ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అక్కంపేట నుంచి చేపట్టిన 'తెలంగాణ బచావో' యాత్ర గురువారం మేడారంలో ముగిసింది. యాత్ర ముగింపు పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరుగు పేరుతో రైతులను దోపిడీకి గురిచేయడంతో వారు ఎక్కడపడితే అక్కడ తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో ఓటర్లకు మద్యం, పైసలు ఇచ్చి ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం ఈ యాత్ర చేపడుతున్నామన్నారు. మేడారం జాతర అభివృద్ధికి కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం.. మేడారానికి సమీపంలోనే ఉన్న ఎల్బాక గ్రామంలో చిన్న లోలెవల్ కాజ్‌వే కూడా నిర్మించలేదని మండిపడ్డారు. ఈ జాతర అభివృద్ధిపై ప్రజలతో కమిటీ వేసి పనుల నాణ్యతను పర్యవేక్షిస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్.. వచ్చే ఎన్నికల్లో పైసా ఖర్చు పెట్టకుండా గెలుస్తామని చెప్పారని, అదే సవాల్‌గా తీసుకుని ఎన్నికల్లో పోటీ చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శంకర్‌రావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, జేఏసీ జిల్లా చైర్మన్ చాప బాబు దొర, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

- ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య

లింగాలఘణపురం: పేదలకు ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం ఈ నెల 27వ తేదీలోపు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి చేపట్టిన బస్సు యాత్ర గురువారం మండలంలోని పటేల్‌గూడెం సమీపంలోని గుడిసెవాసుల వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా గుడిసెవాసుల కాలనీకి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి నగర్‌గా నామకరణం చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వీరయ్య మాట్లాడారు. ఇళ్లులేని పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే ప్రధాన రోడ్డుకు పక్కనే ఉన్నాయని, కోట్ల విలువైన భూమిని ఎందుకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. పేదలకు రోడ్ల వెంట ఇళ్లు అవసరంలేదా.? కొండలు, గుట్టల్లోనే ఉండాలా అంటూ ప్రశ్నించారు. పేదలకు ఇళ్ల స్థలాలు కావాలంటూ ఏడాది నుంచి పోరాడుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 61 ప్రాంతాల్లో భూపోరాటం సాగుతుందని, ఈ నెల 18న చేపట్టిన బస్సు యాత్ర 27వ తేదీన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ముగుస్తుందని, అప్పటి వరకు ఇళ్లు, ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, బస్సు యాత్ర బృందం నేతలు పద్మ, జగదీశ్, శోభన్, ఆనంద్, కనకారెడ్డి, రాజు, చందు, యాదగిరి, సోమయ్య, గోపి, శ్రీనివాస్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షుడిగా విద్యాసాగర్‌రావు

- 17మందితో కమిటీ ఏర్పాటు

వరంగల్: టీడీపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కమిటీని నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గురువారం జాబితాను విడుదల చేశారు. పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడిగా అర్శనపల్లి విద్యాసాగర్ రావు (వరంగల్ పశ్చిమ), ఉపాధ్యక్షుడిగా జీఎల్ శ్రీధర్ (వరంగల్ తూర్పు), రెగూరి వెంకట్‌రెడ్డి(పరకాల), బర్ల యాకూబ్ (వరంగల్ పశ్చిమ), ప్రధాన కార్యదర్శులుగా నల్లకుంట రవికుమార్ (వరంగల్ తూర్పు), చొల్లేటి కృష్ణారెడ్డి(స్టేషన్ ఘనపూర్), అధికార ప్రతినిధులుగా గంగబోయిన రవీందర్ (పరకాల), బొలగాని చిత్తరంజన్ (పాలకుర్తి), కార్యాలయ కార్యదర్శిగా పిట్టల శ్రీనివాస్ (వర్ధన్నపేట), కోశాధికారిగా కాగితాల జయశంకర్ (వరంగల్ పశ్చిమ), కార్యనిర్వాహక కార్యదర్శులుగా రేగుల సదయ్య(పరకాల), మాచర్ల నగేశ్(భూపాలపల్లి), కార్యదర్శులుగా హరిదాస్యం సురేశ్(వరంగల్ తూర్పు), లాడే రవీందర్(పరకాల), కేదాసి స్వామి (పరకాల), తాటికాయల అనిల్(వర్ధన్నపేట), మాడగాని మనోహర్(వరంగల్ పశ్చిమ) నియమితులయ్యారు. పార్టీ పట్ల అంకితభావం, క్రమశిక్షణను పరిగణలోకి తీసుకొని ముఖ్య నాయకులతో చర్చించి పూర్తిస్థాయి పార్టీ కమిటీని ఎంపిక చేశామని జ్ఞానేశ్వర్ తెలిపారు.